క్లుప్తంగా

వ్యవసాయంపై అవగాహన



అనాతవరంలో పంటపొలంలో వరినాట్లు వేస్తున్న విద్యార్థులు

ముమ్మిడివరం: జీవరాశులన్నింటికీ భూమి జీవనాధారమని, వ్యవసాయంలో వరి సాగు పంటను పండించడం ద్వారా ప్రజలకు ఆహారాన్ని సమకూర్చుకోవచ్చని సంసిద్ధ స్కూల్ ప్రిన్సిపాల్ మెట్ల సురేష్ పేర్కొన్నారు. ముమ్మిడివరం మండలం అనాతవరంలో బుధవారం ఒక రైతు వ్యవసాయ భూమిలో సంసిద్ధ స్కూల్ విద్యార్థులకు వరి పంటను పండించే విధానంలో భాగంగా విద్యార్థులతో స్వయంగా వరినాట్లు నాటించారు. తద్వారా ప్రారంభంలో రైతులు వరిసాగును ఎలా చేస్తారు. ఏయే సమయంలో పురుగుమందులు పిచ్చికారీ చేస్తారు. పంట కోత విధానాలను విద్యార్థులకు వివరించారు.

ఎరువుల దుకాణాలపై దాడులు

ఉప్పలగుప్తం: భీమనపల్లిలోని శ్రీలక్ష్మీనారాయణ ఏజెన్సీస్ ఎరువుల దుకాణంపై విజిలెన్స్ అధికారులు బుధవారం దాడి చేసి సోదాలు జరిపినట్టు వ్యవసాయాధికారి జి.కుమార్ బాబు ఓ ప్రకటనలో తెలిపారు. రాజమండ్రి విజిలెన్స్ అండ్ ఎన్ఫోర్స్‌మెంట్ డీఎస్పీ తాతారావు ఆధ్వర్యంలో వ్యవసాయశాఖ అధికారులు దుకాణంలో తనిఖీలు చేపట్టామన్నారు. దుకాణంలో రికార్డుల్లో అవకతవకలు ఉన్నట్టు సోదాల్లో బయటపడ్డాయన్నారు. 100.66 మెట్రిక్ టన్నుల ఎరువులను స్వాధీనం చేసుకున్నామన్నారు. దీని విలువ సుమారు రూ.24 లక్షల ఉంటుందని, యజమానులపై 6ఏ కేసు నమోదు చేశామని ఏవో కుమార్‌బాబు వివరించారు. వారి వెంట పంచాయతీ కార్యదర్శి పెట్టా నాగేశ్వరరావు ఉన్నారు.

పంచాయతీల్లో సామాజిక తనిఖీ గ్రామసభలు

తాళ్లరేవు: మండల పరిధిలోని ఎనిమిది గ్రామ పంచాయతీలలో బుధవారం ఎంజీఎన్ఆర్ఈజీఎస్ సామాజిక తనిఖీ గ్రామసభలు నిర్వహించారు. సుంకరపాలెం గ్రామపంచాయతీలో మండల సర్పంచ్‌ల సమాఖ్య అధ్యక్షుడు, స్థానిక సర్పంచ్ టిళ్లపూడి నాగేశ్వరరావు అధ్యక్షతన గ్రామసభ నిర్వహించారు. అదేవిధంగా కోరంగి పంచాయతీలో సర్పంచ్ పెయ్యల మంగేష్, తాళ్లరేవులో సర్పంచ్ రెడ్డి అరుణ సుహాసినీదేవి అధ్యక్షతన గ్రామసభలు జరిగాయి. అదేవిధంగా లచ్చిపాలెం, గోవలంక, పిల్లంక, చొల్లంగిపేట, చొల్లంగి పంచాయతీలలో కూడా గ్రామసభలు నిర్వహించి ఆయా పంచాయతీలలో చేసిన ఉపాధి పనులపై సమీక్షించారు. ఈ కార్యక్రమాలలో డిప్యూటీ ఎంపీడీఓ ప్రకాష్, ఏపీఓ టి.తేజశ్విని, గ్రామ పంచాయతీ కార్యదర్శులు రమణ, వలీబాబా, నున్న శంకరనారాయణ, నాయకులు టేకుమూడి లక్ష్మణరావు, వాడ్రేవు వీరబాబు, టేకుమూడి ఈశ్వరరావు, గుంటముక్కల సూరిబాబు, సుంకర చంద్రం, మధ్రి అశోక్, ఉంగరాల వెంకటేశ్వరరావు సర్పంచ్‌లు, ఎంపీటీసీ సభ్యులు, సిబ్బంది పాల్గొన్నారు.

డ్రంక్ అండ్ డ్రైవ్‌లో రూ.1.10 లక్షల జరిమానా

తాళ్లరేవు: జాతీయ రహదారి 216లో కోరింగ పోలీస్‌స్టేషన్ వద్ద నిర్వహించిన తనిఖీలలో డ్రంక్ అండ్ డ్రైవ్ కేసులలో 11 మందికి రూ.1.10 లక్షల జరిమానా విధించినట్టు కోరింగ ఎస్సై పి.సత్యనారాయణ తెలిపారు. ఆయన తెలిపిన వివరాల మేరకు రోడ్డు ప్రమాదాల నివారణలో భాగంగా విస్తృతంగా వాహనాలు తనిఖీలు చేయగా మద్యం తాగి వాహనం నడుపుతున్న 11మందిపై కేసులు నమోదు చేసి కాకినాడ ఫస్ట్ క్లాస్ జూనియర్ సివిల్ జడ్జి మేజిస్ట్రేట్ ఎదుట హాజరు పరచగా ఒక్కొక్కరికీ రూ.10 వేల చొప్పున జరిమానా విధించినట్టు తెలిపారు.

రాత్రికి రాత్రే రంగా విగ్రహం ఏర్పాటు



అక్రమ కట్టడం వద్ద ఏర్పాటు చేసిన రంగా విగ్రహం

అల్లవరం: బోడసకుర్రు పంట కాలువపై అక్రమంగా నిర్మించిన భారీ భవంతిని రాత్రికి రాత్రే రంగా విగ్రహాన్ని మంగళవారం ఏర్పాటు చేశారు. పంట కాలువల వెంబడి అక్రమ కట్టడాలపై చర్యలు తీసుకోవాలని ఇరిగేషన్ అధికారులకు ఇటీవల జిల్లా ఉన్నతాధికారులు ఆదేశాలు జారీ చేశారు. వాటిని ఏ మాత్రం ఖాతరు చేయకుండా ఇరిగేషన్ అధికారుల కళ్లు కప్పి రెండు అంతస్తుల భవనాన్ని కాలువపై నిర్మించారు. ఈ విషయంపై జూలై 25వ తేదీన 'ఆటంకాలు వద్దన్నా' శీర్షికన సాక్షి దినపత్రికలో కథనం ప్రచురితమైంది. దానికి స్పందించిన జిల్లా అధికారులు అక్రమ కట్టడాన్ని తొలగించాలని ఇరిగేషన్ అధికారులకు ఆదేశాలు జారీ చేశారు. దీంతో బుధవారం ఉదయం అక్రమ కట్టడాన్ని తొలగిస్తారని తెలిసి అక్కడ రాత్రికి రాత్రే గుర్తు తెలియని వ్యక్తులు రంగ విగ్రహాన్ని ఏర్పాటు చేశారు. దీంతో పోలీసులు రంగ ప్రవేశం చేసి గ్రామస్తులతో చర్చించారు. రెండు రోజులు గడువు కోరడంతో విగ్రహాన్ని తొలగించకుండా ముసుగు కప్పి ఉంచారు. జిల్లా ఉన్నతాధికారుల ఆదేశాలను ఇరిగేషన్ అధికారులు పాటిస్తారా..లేదా రాజకీయ ఒత్తిళ్లకు లొంగిపోతారా అనేది వేసి చూడాలి.

వరదొస్తే.. వణుకే..

- లంక భూములను చేరిన గోదావరి
- నదీ గర్భంలో కలిసిపోతున్న పంట పొలాలు, ఇళ్లు
- నష్టపోతున్న రైతులు
- భయాందోళనకు గురవుతున్న ప్రజలు



సలాదివారిపాలెంలో కోతకు గురవుతున్న నివాసగృహం(ఫైల్)

ముమ్మిడివరం: గోదావరికి వరదొస్తే.. లంక గ్రామాల ప్రజల గుండెల్లో గుబులు పుడుతుంది. వరద ప్రవాహానికి విలువైన పంట భూములు నదీ గర్భంలో కలిసిపోతున్నాయి. వరద నీటిలో వేలాది ఎకరాలు పంట చిక్కుకుంటుంది.

ఇదీ పరిస్థితి..

ముమ్మిడివరం నియోజకవర్గంలో గౌతమీ, వృద్ధ గౌతమీ నదీపాయల మధ్య ఉన్న లంక గ్రామాలు గోదావరి ఆటు పోట్ల మధ్య తల్లడిల్లిపోతున్నాయి. వరదనీరు లంక గ్రామలను చుట్టుముడుతోంది. పచ్చని పంట పొలాలతో కళకళలాడే వ్యవసాయ భూములు నీట మునుగుతున్నాయి. వ్యవసాయ ఉత్పత్తులు సురక్షిత ప్రాంతాలకు తరలించేందుకు రైతులు నానా తంటాలు పడుతున్నారు. పశువుల్లంక మొండి రేవు వద్ద గోదావరి ఉధృతి మరింత భయానకంగా ఉంటూ ఐలెండ్ ప్రజలను కంటి మీద కునుకు లేకుండా చేస్తోంది. సలాదివారి పాలెం వద్ద శేరిల్లంక గ్రామాలలో వేదాది ఎకరాల విలువైన వ్యవసాయ భూములు నదీ కోతకు గురయ్యాయి. గతేడాది గోదావరి ప్రవాహ వేగానికి సలాదివారిపాలెంలో రెండు ఎకరాలు, శేరుల్లంకలో 10 ఎకరాలు భూమి గోదావరిలో కలిసిపోయింది. ఇప్పుడిప్పుడే వరదల సీజన్ మొదలు కావడంతో రాబోయే రోజులలో మరింత నష్టాలను ఎదుర్కోవాల్సి వస్తోందని లంక వాసులు దిగాలు చెందుతున్నారు. శేరుల్లంకలో గ్రామంలో నిర్మించిన సీసీ రోడ్డు 40 మీటర్ల మేరకు కోతకు గురై నదీపాతం అయింది. గ్రామంలో ప్రజల అవసరాలను తీర్చే పురాతన బావి వరద తాకిడికి గురై నదీలో కలిసిపోయింది. వరద నీరు ఇళ్లను తాకే కొద్ది లంక గ్రామవాసులు బిక్కుబిక్కుమంటూ కాలం వెల్లదీస్తున్నారు. గతేడాది నీటి ప్రవాహవేగానికి నాలుగు నివాస గృహాలు నదీలో కొట్టుకుపోయాయి. నీరు గ్రామాలను ముంచెత్తుతున్నా ప్రజలు మాత్రం అధిక వ్యయ ప్రయాసలు గురించి అక్కడే కాలం వెల్లదీస్తుంటారు. అలాగే లంకాఫ్ ఠానేల్లంక, గురజాపు లంక గ్రామాల్లో వరదనీరు గ్రామాలను ముంచెత్తుతోంది. ఆయా గ్రామాలలో కూరగాయలు, ఇతర వాణిజ్య పంటలు నీటపంటలు నీట మునిగి భారీ నష్టాలను ఎదుర్కొంటున్నారు.



శేరిల్లంకలో కోతకు గురవుతున్న లంక భూములు

రివిట్‌మెంట్ సౌకర్యం కల్పించాలి



లంక గ్రామాలు ఉన్న దీవి చుట్టూ రివిట్‌మెంట్ సౌకర్యం కల్పించాలి. వరదల సమయంలో ప్రజా ప్రతినిధులు అధికారులు వచ్చి హామీలు ఇస్తున్నారు. తప్ప వాటిని అమలు చేయడంలేదు. వరదల వల్ల ప్రతి ఏటా పంట భూములు కోతకు గురవుతున్నాయి. విలువైన పంటలు గంగపాలవుతున్నాయి. దీవి చుట్టూ రక్షణ కవచం ఏర్పాటు చేయాలి

– ఎస్.సత్యనారాయణ, లంక వాసి, సలాదివారిపాలెం

మా బతుకులు మారవు



వరదల ఆటుపోట్ల నుంచి మాకు రక్షణ కల్పించాలి. వరదల వల్ల జరిగే నష్టాలను అంచనాలు వేయడం కొద్దిపాటి నష్టపరిహారం ఇచ్చి చేతులు దులుపుకొంటున్నారు ,తప్ప శాశ్వత చర్యలు చేపట్టడం లేదు. దశాబ్దాలు గడచినా మా బతుకులు మారడం లేదు.

– సలాది జానకీరామయ్య, రైతు, సలాదివారిపాలెం

నిరుద్యోగులు, ఆడ బిడ్డలకు తీరని అన్యాయం

- బాబు ష్యూరిటీ– మోసం గ్యారంటీ కార్యక్రమాల్లో వైఎస్సార్ సీపీ నేతలు



చంద్రబాబు మోసాలతో ఉన్న క్యూఆర్ కోడ్ పత్రాలను ప్రదర్శిస్తున్న మున్సిపల్ చైర్‌పర్సన్ సత్య నాగేంద్రమణి, వైస్ చైర్మన్ నానిరాజు తదితరులు



బోడసకుర్రులో బాబు ష్యూరిటీ.. మోసం గ్యారంటీపై క్యూఆర్ కోడ్‌ని ప్రదర్శిస్తున్న ఎమ్మెల్సీ ఇజ్రాయిల్ తదితరులు

అమలాపురం టౌన్: చంద్రబాబు పాలనలో నిరుద్యోగులు, ఆడ బిడ్డలకు తీరని అన్యాయం జరుగుతోందని అమలాపురం మున్సిపల్ చైర్‌పర్సన్ రెడ్డి సత్య నాగేంద్రమణి అన్నారు. పట్టణంలోని 17, 18, 19, 20 వార్డుల్లో పట్టణ వైఎస్సార్ సీపీ ఆధ్వర్యంలో బుధవారం జరిగిన 'బాబు ష్యూరిటీ – మోసం గ్యారంటీ' కార్యక్రమాల్లో చైర్‌పర్సన్ సత్య నాగేంద్రమణి ప్రజలతో మాట్లాడారు. మున్సిపల్ వైస్ చైర్మన్ రుద్రరాజు నానిరాజు కూడా ఇంటింటికీ తిరిగి చంద్రబాబు నయవంచక పాలన, ఆయన చేసిన మోసాలను వివరించారు. అనంతరం 18వ వార్డులో మున్సిపల్ వైస్ చైర్మన్ నానిరాజు ఇంటి వద్ద పార్టీ పట్టణ అధ్యక్షుడు సంసాని బులినాని అధ్యక్షతన జరిగిన సమావేశంలో పార్టీకి చెందిన స్థానిక సంస్థల ప్రజాప్రతినిధులు, పార్టీ నాయకులు బాబు పాలనలో మోసాల చిట్టాతో ఉన్న క్యూఆర్ కోడ్ పత్రాలను ప్రదర్శించారు. వైఎస్ జగన్ పాలనతో ప్రజలకు అందిన సంక్షేమ ఫలాలు అందుకున్న ప్రజలు నేడు చంద్రబాబు పాలనలో హామీలు ఇచ్చిన పథకాలకు దిక్కేలేదని ఆవేదన వ్యక్తం చేస్తున్నారని పట్టణ పార్టీ అధ్యక్షుడు బులినాని స్పష్టం చేశారు. అప్పుడు జగన్ చెప్పింది చేస్తే ఇప్పుడు చంద్రబాబు చెప్పినవి కూడా చేయకుండా మోసం చేస్తున్నాడని పేర్కొన్నారు. పార్టీ మైనార్టీ సెల్ జిల్లా అధ్యక్షుడు షేక్ అబ్దుల్ ఖాదర్, మున్సిపల్ కౌన్సిలర్లు గొవ్వాల రాజేష్, చిత్రపు రామకృష్ణ, కట్టోజు సన్న్యాసు, బండారు గోవిందు, కౌన్సిల్ కో ఆప్షన్ సభ్యుడు జాన్ బెల్లీ తదితరులు ఇంటింటికీ వెళ్లి కూటమి ప్రభుత్వ కుతంత్రాలను ప్రజలకు వివరించారు. పార్టీ నాయకులు వేగిరాజు సాయిరాజు, కముజు రమణ, సుంకర సుధ, గోపి రమేష్, దంతులూరి రోహిత్ వర్మ, చికాల రవిశంకర్, పాలమూరి ప్రవీణ్, దూడల వెంకట వినీతాదేవి, నూలు రమేష్, మొల్లేటి కనకదుర్గ, స్వర్ణకుమారి, కల్వకొలను ఉమ, దొంగ చిన్నా, యర్రంశెట్టి ప్రసాద్ తదితరులు ప్రచారంలో పాల్గొన్నారు.

హామీల అమలు ఎక్కడా..
: ఎమ్మెల్సీ బొమ్మి ఇజ్రాయిల్

అమలాపురం రూరల్: చంద్రబాబు ఎన్నికల సమయంలో ప్రజలకు ఇచ్చిన సూపర్ సిక్స్ హామీలను సక్రమంగా అమలు చేయకుండా ప్రజలను మోసం చేశారని ఎమ్మెల్సీ బొమ్మి ఇజ్రాయిల్ అన్నారు. అమలాపురం మండలం పేరూరు, ఇమ్మిడవరప్పాడు గ్రామాల్లో జరిగిన బాబు ష్యూరిటీ– మోసం గ్యారెంటీ కార్యక్రమాన్ని బుధవారం ఎమ్మెల్సీ ఇజ్రాయిల్ ప్రారంభించారు. ఇంటింటికీ వెళ్లి చంద్రబాబు మోసాలను ప్రజలకు వివరించారు. తొలిత పేరూరు సర్పంచ్ దాసరి అరుణడేవిడ్ నివాసం వద్ద ఈ కార్యక్రమాన్ని ప్రారంభించారు. రూరల్ మండల వైఎస్సార్ సీపీ అధ్యక్షుడు గుత్తుల చిరంజీవి, ఎంపీపీ కుడుపూడి భాగ్యలక్ష్మి, జెడ్పీటీసీ సభ్యుడు పందిరి శ్రీహరిరామ్‌గోపాల్, మాజీ జెడ్పీటీసీ కుడుపూడి వెంకటేశ్వరబాబు వైస్ ఎంపీపీ పాలమూరి బాలకృష్ణ, సర్పంచ్‌లు చెల్లుబోయిన నాని, రేలంగి దుర్గరావు, ఎంపీపీలు వాసంశెట్టి శ్రీను, దొంగ ఆంజనేయులు, రేవు శ్రీను, శాంతి భవాని, గ్రామ కమిటీ అధ్యక్షుడు చొల్లంగి సుబ్బిరామ్, జిల్లా మాజీ కార్యదర్శి సరేళ్ళ రామకృష్ణ, మాజీ ఎంపీటీసీ సభ్యులు దాసరి నాగేశ్వరావు, మట్టపర్తి బాబీ, పంచాయతీ సభ్యుడు లక్ష్మీనారాయణ, నాయకులు పాల్గొన్నారు.

చంద్రబాబును నమ్మితే మోసమే..

అల్లవరం: చంద్రబాబుని నమ్మితే మోసపోతామని, అందుకు నిదర్శనమే సూపర్ సిక్స్ పథకాలేనని, ఏ ఒక్కటీ పూర్తిస్థాయిలో అమలుచేయకుండా మోసం చేశారని ఎమ్మెల్సీ బొమ్మి ఇజ్రాయిల్ అన్నారు. వైఎస్సార్‌సీపీ మండల పార్టీ అధ్యక్షులు కొనుకు బాపూజీ ఆధ్వర్యంలో బుధవారం గోడితిప్ప, బోడసకుర్రు, అల్లవరం–2 గ్రామాల్లో బాబు ష్యూరిటీ మోసం గ్యారంటీ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్సీ ఇజ్రాయిల్ మాట్లాడుతూ చంద్రబాబు ఏడాది పాలనపై ప్రజల్లో అసంతృప్తి ఉందన్నారు. ఆయన అధికారంలోకి రావడం కోసం ఎన్ని పార్టీలతోనైనా పొత్తు పెట్టుకుంటారని, తీరా అధికారంలోకి వస్తే పొత్తు పెట్టుకున్న వారిని, నమ్మి ఓట్లు వేసిన ప్రజలను నిలువునా ముంచడం ఆయనకి వెన్నతో పెట్టిన విద్యని అన్నారు. ఏడాది కాలంలో విద్య, వైద్యం నిరుపేదలు, మధ్యతరగతి ప్రజలకు అందని ద్రాక్షలా మారిందన్నారు. కూటమి ప్రభుత్వ మోసాలను ప్రజలు గమనిస్తున్నారని ఎమ్మెల్సీ ఇజ్రాయిల్ అన్నారు. స్థానిక సంస్థల ఎన్నికల్లో కూటమి ప్రభుత్వానికి ప్రజలు బుద్ధి చెప్పుతారని హెచ్చరించారు. అనంతరం బాబు ష్యూరిటీ మోసం గ్యారంటీపై ప్రజలకు అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ ఇళ్ల శేషగిరిరావు, జెడ్పీటీసీ కొనుకు గౌతమి, జెడ్పీటీసీ ముదునూరి సతీష్‌రాజు, వైస్ ఎంపీపీ వడ్డి గంగ, జిల్లా ఆర్గనైజింగ్ కార్యదర్శి చింతా రామకృష్ణ, సీనియర్ నాయకుల తిక్కా ప్రసాదు, మండల ప్రధాన కార్యదర్శి వాసంశెట్టి నరసింహరావు, ఎంపీటీసీలు దొమ్మేటి శ్రీశాంతి భవాని, రాజేశ్వరీ, కోఆప్షన్ సభ్యులు పల్లి జేమ్స్, గ్రామకమిటీ అధ్యక్షుడు కొప్పాడి వెర్రియ్య, అంబటి శ్రీను, గోసంగి వెంకటేశ్వరరావు, పార్టీ నాయకులు పులుసుగంటి శ్రీను, చెల్లుబోయిన రమేష్, గుత్తుల రాజు, బొంతు శ్రీను, శివస్వామి, మామిడిశెట్టి బీమేష్, చొల్లంగి రాము, పాలమూర్తి సత్యనారాయణ, బస్వాని రాజు, సాపే ధర్మరాజు, పినమాల విక్రమ్, నార్గన శ్రీను, వాసర్ల శ్రీమన్నారాయణ, అధిక సంఖ్యలో కార్యకర్తలు పాల్గొన్నారు.

బాబూ మోసాలు గుర్తించండి



కార్యక్రమంలో మాట్లాడుతున్న మండల పార్టీ అధ్యక్షుడు వెంకటపతి రాజు

ఐ.పోలవరం: బాబూ ష్యూరిటీ.. భవిష్యత్ గ్యారంటీ అంటూ అధికారంలోకి వచ్చిన చంద్రబాబు ఇచ్చిన హామీలను మరిచిపోయి సూపర్ సిక్స్ పథకాల అమలు చేయకుండా ప్రజలను మోసం చేస్తున్నారని వైఎస్సార్‌సీపీ మండల పార్టీ అధ్యక్షుడు పిన్నమరాజు వెంకటపతి రాజు అన్నారు. బాబు ష్యూరిటీ.. మోసం గ్యారంటీ మండలంలో బుధవారం ఎదర్లంక, పాత ఇంజరం, కొమరగిరి, పశువులలంక గ్రామాల్లో జరిగింది. ఈ సందర్భంగా ఎంపీపీ మోర్తా జ్యోతి, నియోజకవర్గ పార్టీ పరిశీలకుడు మాత మురళీలు మాట్లాడుతూ బాబు మోసాలను ఇంటింటికీ వెళ్లి వివరించాలన్నారు. నాయకులు, కార్యకర్తలు, స్థానిక ప్రజాప్రతినిధులు ఈ కార్యక్రమంలో పాల్గొనాలని కోరారు. పార్టీకి చెందిన సఖిల వెంకటేశ్వరరావు, ఏలూరి ఆదినారాయణ, సుంకర నాగబాబు, రేవు రెడ్డి బాబు, పెద్దిరెడ్డి వెంకటేశ్వరరావు, తోట వెకంఏటశ్వరరావు, కొండేపూడి కృపావర ప్రసాదరావు, కావూరి శ్రీను, చింత సత్తిబాబు, దులుపూడి నాగు, సఖిలే రత్న జోత్యలు పాల్గొన్నారు.

బస్టాండుల్లో వసతులు కల్పించాలి



అమలాపురం ఆర్టీసీ బస్టాండ్‌ను తనిఖీ చేస్తున్న జేసీ నిషాంతి

- అధికారులకు జిల్లా జాయింట్ కలెక్టర్ నిషాంతి ఆదేశాలు

అమలాపురం రూరల్: రోడ్డు రవాణా సంస్థ పరిధిలో జిల్లాలో నాలుగు డిపోల్లో బస్టాండులు, బస్సుల్లో వసతులు, ప్రయాణికులకు మెరుగైన వసతులు కల్పించాలని జిల్లా జాయింట్ కలెక్టర్ టి.నిషాంతి ఆర్టీసీ అధికారులను ఆదేశించారు. బుధవారం అమలాపురం ఆర్టీసీ డిపోలో వివిధ రకాల ప్రయాణికుల వసతులను ఆమె ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఆమె ప్రయాణికులతో మాట్లాడి బస్ స్టేషన్‌లోని సౌకర్యాల గురించి ఆరా తీశారు. ప్రయాణికులకు తాగునీరు, టాయిలెట్లు, రిజర్వేషన్ కేంద్రం, సమాచార కేంద్రం, విద్యార్థుల బస్ పాస్ కౌంటర్, కార్గో కేంద్రాలను ఆమె పరిశీలించి పరిశుభ్రత నిర్వహణ అంశాలపై సూచనలు చేశారు. ఆమెకు ప్రజా రవాణా అధికారి ఎస్‌టీపీ రాఘవ కుమార్ బస్టాండ్ నిర్వహించిన తీరుతెన్నుల వివరించారు. తదుపరి డిపోలోని గ్యారేజ్‌లోని బస్సుల నిర్వహణ గురించి అమలాపురం డిపో మేనేజర్ చల్లా సత్యనారాయణ మూర్తి జాయింట్ కలెక్టర్ వివరించారు. ఆర్ఎం కార్యాలయంలో అధికారులతో సమావేశం నిర్వహించి 15వ తేదీ నుంచి అమలులోకి రానున్న ఆర్టీసీలో మహిళలకు ఉచిత ప్రయాణం స్త్రీ శక్తి పథకం అమలుపై ముందుగా సర్వసన్నద్ధం కావాలని సూచించారు. త్వరలో రానున్న విద్యుత్ బస్సులకు పవర్‌స్టేషన్ స్థలాలన్ని పరిశీలించారు. అదనపు రెవెన్యూ, కార్గో ఆదాయం పెంచుకోవాలని ఆమె సూచించారు. ప్రభుత్వం ప్రజల సేవలపై పాజిటివ్ పబ్లిక్ పెర్సెప్షన్ ద్వారా ప్రజా సంతృప్తి స్థాయిలను ఐవీఆర్ఎస్ ద్వారా రోజువారి సమీకరిస్తుందని, తాగునీరు, మరుగుదొడ్ల నిర్వహరణ తక్కువ స్థాయిలో ఉందిని మరింత మెరుగు పర్చులనని సూచించారు. ఆర్టీసీకి సంబంధించి ప్రయాణికుల సంతృప్తి స్థాయిలను ఆరా తీస్తోందన్నారు. ఆ దిశగా ప్రయాణికుల సంతృప్తి కొలమానంగా ఆర్టీసీ యాజమాన్యాలు పనిచేయాల్సిన ఆవశ్యకత ఎంతైనా ఉందన్నారు. రోడ్డుప్రమాదాలు, అన్‌లైన్ సేవలు, విద్యార్థుల సేవలు, బస్సుల్లో వేధింపు ఇతర సమస్యలపై ఆమె సమీక్షించారు. ఆదాయం సేవల్లో జిల్లాలో ప్రథమస్థాపంలో ఉండాలని సూచించారు. ప్రతి అంశంలో ఆర్టీసీ అధికారులు ప్రజా సంతృప్తి స్థాయిలను మెరుగుపరిచి జిల్లాకు పేరు ప్రఖ్యాతులు తీసుకొని రావాలన్నారు. అనంతరం మొక్కలు నాటారు. ఈ కార్యక్రమంలో సీఐ ప్రతిమకుమారి, ఓపీఆర్ఎస్ ఇన్‌చార్జి నంది వరహాలబాబు, ఆర్టీసీ ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

ప్రమాదాల నివారణకు చర్యలు చేపట్టండి



ప్రాంతీయ ఆస్పత్రి వైద్యుడు వీరభద్రుడికి నగదు ప్రోత్సాహంతో సత్కరిస్తున్న కలెక్టర్ మహేష్‌కుమార్

అమలాపురం రూరల్: జిల్లాలోని జాతీయ రహదారి 216లో ఎదురులంక– దిండి మధ్య రోడ్డు ప్రమాదాలు నివారణకు తగిన చర్యలు చేపట్టాలని కలెక్టర్ ఆర్.మహేష్ కుమార్ ఆదేశించారు. బుధవారం అమలాపురం కలెక్టరేట్‌లో జాతీయ రహదారి భద్రత, చించినాడ బ్రిడ్జి మరమ్మతులు, వివిధ సర్వీస్ రోడ్ల నిర్మాణంపై సమీక్షించారు. కలెక్టర్ మాట్లాడుతూ 216 జాతీయ రహదారి రాజోలు బైపాస్ రోడ్డు ప్రారంభం నుంచి పాసర్లపూడి వరకూ ఆక్రమణల తొలగింపు, జంక్షన్ల అభివృద్ధి పనులను ఈ నెలాఖరు నాటికి పూర్తి చేయాలని ఆదేశించారు. చించినాడ వంతెన పరిస్థితిని ఆరా తీసి, పెడల్స్ బేరింగ్‌లు ఏర్పాటు, మరమ్మతులు నవంబర్ నెలాఖరు నాటికి పూర్తి చేయాలని అధికారులకు సూచించారు. జాతీయ రహదారుల విభాగం అసిస్టెంట్ ఇంజినీర్ వెంకటరమణ, టాటా ప్రాజెక్ట్ ప్రతినిధి గోపాల్, భూ సేకరణ విభాగం సూపరింటెండెంట్ ఏసుబాబు పాల్గొన్నారు.

వైద్య ఉద్యోగులకు ప్రోత్సాహకాలు

ప్రపంచ జనాభా దినోత్సవాన్ని పురస్కరించుకుని జిల్లా వైద్య ఆరోగ్య శాఖలో ఉత్తమ సేవలు అందించిన ఉద్యోగులకు నగదు ప్రోత్సాహకాలు, ప్రశంసా పత్రాలను కలెక్టర్ మహేష్ కుమార్ అందించారు. కలెక్టరేట్‌లో జరిగిన సమావేశంలో ఉత్తమ పనితీరు కనబరిచిన ఉద్యోగులను నగదు, పురస్కారాలతో సత్కరించారు. అమలాపురం ప్రాంతీయ ఆస్పత్రికి చెందిన డాక్టర్ బి.వీరభద్రుడు, రామచంద్రపురం ప్రాంతీయ ఆసుపత్రికి చెందిన డాక్టర్ ఎస్.ప్రవీణ్‌కు నగదు ప్రోత్సాహకాలు అందించారు. అమలాపురం ప్రాంతీయ ఆసుపత్రి ఆర్ఎంసీహెచ్ కౌన్సిలర్ రమాదేవి, రామచంద్రపురం పీపీ యూనిట్ ఏఎన్ఎం సులోచన, కాట్రేనికోన పీహెచ్‌సీ ఆశ కార్యకర్త పి.వరలక్ష్మి, సఖినేటిపల్లి పీహెచ్‌సీ ఎంఎల్‌హెచ్‌పీ కుమారి, జె.సుస్మితలకు ఒక్కొక్కరికి రూ. 2,500 చొప్పున నగదు, ప్రశంసా పత్రాలను అందించారు. ముగ్గురు అంత కన్నా ఎక్కువ మంది పిల్లలను కన్న ముగ్గురు దంపతులను ఎంపిక చేసి ప్రోత్సాహకాలు అందించారు. జిల్లా వైద్యారోగ్య శాఖ అధికారి ఎం.దుర్గారావుదొర, జిల్లా వైద్య సేవల సమన్వయ అధికారి డాక్టర్ కార్తీక్ పాల్గొన్నారు.

యువతకు ఆదర్శప్రాయుడు 'జక్కంపూడి'

- తాళ్లరేవులో ఘన నివాళులు



తాళ్లరేవు సంతపేట సెంటర్‌లో జక్కంపూడి రామ్మోహన్‌రావుకు నివాళులు అర్పిస్తున్న వైఎస్సార్‌సీపీ శ్రేణులు

తాళ్లరేవు: ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా రాజకీయాలలో చెరగని ముద్ర వేసుకున్న మాజీమంత్రి, ఉద్యమనేత స్వర్గీయ జక్కంపూడి రామ్మోహన్‌రావు యువతకు ఆదర్శప్రాయుడని వైఎస్సార్ సీపీ రాష్ట్ర యువజన విభాగం అధికార ప్రతినిధి వుంగరాల సంతోష్ తెలిపారు. బుధవారం స్థానిక సంతపేట సెంటర్‌లోని వైఎస్సార్ విగ్రహం వద్ద జక్కంపూడి రామ్మోహనరావు 72వ జయంతోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. పార్టీ మండల అధ్యక్షుడు కాదా గోవిందకుమార్ అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో జక్కంపూడి చిత్రపటానికి జెడ్పీటీసీ సభ్యులు దొమ్మేటి సామ్యూల్ సాగర్, వుంగరాల సంతోష్ తదితరులు పూలమాలలు వేసి ఘనంగా నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ జక్కంపూడి విద్యార్థి దశ నుంచి నాయకుడిగా ఎదిగి రాష్ట్ర రాజకీయాలలో కీలకపాత్ర పోషించారన్నారు. జనహృదయ నేత వైఎస్ రాజశేఖర్‌రెడ్డి అనుంగు శిష్యుడిగా ఉంటూ ఆయన అడుగుజాడల్లో పనిచేశారని కొనియాడారు. రాజకీయాల్లోకి వచ్చే యువత జక్కంపూడిని ఆదర్శంగా తీసుకోవాలని పిలుపునిచ్చారు. అనంతరం స్థానిక సామాజిక ఆస్పత్రిలోని రోగులకు పండ్లు, రొట్టెలు అందజేశారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్‌లు వెంటపల్లి నూకరాజు, పంపన రామకృష్ణ, ఎంపీటీసీ సభ్యులు పోతుల రత్నకుమారి, కోరుకొండ కిరణ్‌కుమారి, మండల ఎస్సీసెల్ అధ్యక్షుడు దడాల జగదీశ్వరరావు, నాయకులు కొపనాతి నాగరాజు, చిట్టూరి చలపతి, బొంతు మోహన్, కొటికెలపూడి చంద్రశేఖర్, పెయ్యల కొండబాబు, రేవు నాగేశ్వరరావు, సంగాని దాసు, పందిరిపల్లి రాజేష్, పిల్లి మణికంఠ, పిల్లి బాబీ, గంటా దిలీప్, గునిపే విష్ణు, నేరేడిమిల్లి స్వామి, నీలపాల శ్రీను, నేల శ్రీను తదితరులు పాల్గొన్నారు.



సామాజిక ఆస్పత్రిలో రోగులకు పండ్లు, రొట్టెలు పంపిణీ చేస్తున్న వైఎస్సార్ సీపీ నేతలు

తల్లిపాలు బిడ్డకు అమృతం



సీమంతాలు చేస్తున్న సీడీపీవో నిహారిక తదితరులు

ఐ.పోలవరం: తల్లిపాలు అమృతమని, ప్రతి తల్లి తమ బిడ్డకు తల్లిపాలుం అందించాలని ముమ్మిడివరం సీడీపీవో ఎమ్.నిహారిక అన్నారు. ముమ్మిడివరం ఐసీడీసీఎస్ ప్రాజెక్టు ఆధ్వర్యంలో బుధవారం ఐ.పోలవరంలో మండల స్థాయిలో ప్రపంచ తల్లిపాల వారోత్సవాల ఘనంగా నిర్వహించారు. ముమ్మిడివరం ఆగస్టు ఒకటో తేదీ నుంచి ఏడో తేదీ వరకు తల్లిపాలు వారోత్సవాలు నిర్వహిస్తున్నారు. ఈ సందర్భంగా జరిగిన కార్యక్రమంలో నిహారిక మాట్లాడుతూ గర్భిణులు పుట్టిన శిశువుకి గంటలోపు తల్లిపాలను పట్టించాలన్నారు. అనంతరం గర్భిణులకు సామూహిక సీమంతాలు నిర్వహించారు. దాతలు సాగిరాజు సూరిబాబు రాజు, కాకర్లపూడి రాజేష్, పసుపు, కుంకుమ, చీర, సారెలు ఇచ్చి ఆశీర్వదించారు. ఎంపీడీవో లక్ష్మీ సుబ్రహ్మణ్యేశ్వర శర్మ, ఎంఈవో కొండారెడ్డి, ఏపీఎం రమాకాంత్, హెడ్ కానిస్టేబుల్ సత్యనారాయణ, ఎన్జీవో డాక్టర్ పుల్లెపు వెంకటేశ్వరరావు, పిన్నమ్మరాజు శివ, దేవు రాంబాబు, సంబూరి సీతారామరాజు, ఇందుగుల సూరిబాబు, రాయిపు రెడ్డి సూరిబాబు, అంగన్‌వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.

తల్లిపాలతో సంపూర్ణ ఆరోగ్యం

అమలాపురం రూరల్: పుట్టిన బిడ్డకు తల్లిపాలు ఇస్తే సంపూర్ణ ఆరోగ్యంతో జీవిస్తారని ఐసీడీఎస్ అమలాపురం ప్రాజెక్ట్ అధికారి రమాదేవి పేర్కొన్నారు. నడిపూడి సర్పంచ్ సీహెచ్ వెంకటేశ్వరరావు ఆధ్వర్యంలో బుధవారం అంగన్‌వాడీ కేంద్రంలో తల్లిపాల వారోత్సవాలను నిర్వహించారు. గర్భిణులకు సీమంతాలు చేశారు. సూపర్‌వైజర్ విజయ కుమారి, ఉప సర్పంచ్ రంకిరెడ్డి సాంబశివరావు, వార్డు సభ్యు లు, అంగన్‌వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు. బండారులంక చినచంద్రాపురం అంగాన్‌వాడీ కేంద్రంలో సర్పంచ్ పెనుమాల సునీత, పీడీ శాంతలక్ష్మి గర్భిణులకు సీమంతాలు చేశారు. మాజీ ఎంపీటీసీ మాడా మాధవి, సూపర్‌వైజర్ మహేశ్వరి తదితరులు పాల్గొన్నారు.